ఆ హీరో ఏం మనిషి?

- సినిమావాళ్ల ఆటలు సాగనివ్వను
- అల్లు అర్జున్‌పై రేవంత్‌రెడ్డి విసుర్లు
- సినీప్రముఖులపై కూడా విమర్శలు
- హైకోర్టు ఆదేశాలపైనా కామెంట్లు
- బెనిఫిట్ షోలు ఉండవు: కోమటిరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ''థియేటర్‌లో ఒక తల్లి చనిపోయినా కూడా మానవత్వం లేకుండా రూఫ్‌టాప్ ఓపెన్ చేసి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయిన ఆ హీరో ఏం మనిషి..? మృత్యువుతో పోరాడుతున్న బాలుడిని ఆ హీరోనే కాదు.. సినీప్రముఖులు కూడా పరామర్శించలేదు. అంటూ సినీప్రముఖులపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను సీఎంగా ఉన్నంతకాలం సినిమావాళ్ల ఆటలు సాగవనివ్వనని స్పష్టంచేశారు. అసెంబ్లీలో రైతుభరోసా చర్చ సందర్భంగా సంధ్య థియేటర్ ఘటనను ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ప్రస్తావించారు. ఒవైసీకి రేవంత్‌రెడ్డి సమాధానం చెబుతూ అల్లు అర్జున్, సినీప్రముఖులను తప్పుబట్టారు.

పర్మిషన్ కుదరదని ముందే చెప్పారు!

పుష్ప 2 బెనిఫిట్ షోకు హీరో వస్తున్నారని సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులను కోరిందని, ఇబ్బందులు ఎదురవుతాయని పోలీసులు అనుమతి ఇవ్వలేదని సీఎం తెలిపారు. పోలీసుల సూచనలను పట్టించుకోకుండా అల్లు అర్జున్ థియేటర్‌కు వచ్చారని, రోడ్ షో నిర్వహించారని మండిపడ్డారు. థియేటర్ గేట్లను తెరవడంతో అభిమానులు, హీరో బౌన్సర్ల మధ్య తోపులాట జరిగిందని వివరించారు. రేవతి అనే మహిళ, ఆమె కుమారుడు శ్రీతేజ్ నలిగిపోయారని తెలిపారు. అల్లు అర్జున్ థియేటర్ లోపలికి వెళ్లిన తర్వాత స్పృహతప్పిన రేవతి, శ్రీతేజ్‌ను గుర్తించిన పోలీసులు పీసీఆర్ చేసి, దవాఖానకు తరలించారని చెప్పారు. అప్పటికే రేవతి మృతి చెందిందని, శ్రీతేజ్ బ్రెయిన్ డెడ్ అయ్యాడని రేవంత్‌రెడ్డి తెలిపారు.

వెళ్లాలని చెప్పినా వినని హీరో!

అల్లు అర్జున్ థియేటర్ లోపలికి వెళ్లి బాల్కనీలో కూర్చున్నారని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పేందుకు థియేటర్ నిర్వాహకులు వెళ్లగా బౌన్సర్లు అడ్డుకున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. సినిమా చూసి వెళ్తానని అల్లు అర్జున్ నిర్లక్ష్యంగా బదులిచ్చారని విమర్శించారు. మహిళ మృతి విషయాన్ని చెప్పి, వెళ్లకపోతే అరెస్టు చేస్తామని హెచ్చరించడంతో అల్లు అర్జున్ వెళ్లిపోయారని సీఎం తెలిపారు. మానవత్వం లేకుండా చేతులు ఊపుకుంటూ హీరో వెళ్లిపోయారని ఆరోపించారు. ఆ హీరో ఏం మనిషి? అని విరుచుకుపడ్డారు. పోలీసులు కేసు పెట్టారని, విచారణ కోసం ఇంటికి వెళ్లిన పోలీసులతో అల్లు అర్జున్ దురుసుగా ప్రవర్తించడంతో అరెస్ట్ చేశారని వెల్లడించారు. హైకోర్టు వెంటనే విచారణ జరిపి, బెయిల్ మంజూరు చేసిందని, అర్ధరాత్రి అని చూడకుండా విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసిందని రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తంచేశారు. అర్ధరాత్రి జైలు తలుపులు తెరవాలంటే తాను ఎలా తెరుస్తామని వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్ అరెస్టును కొందరు రాజకీయం చేస్తున్నారని, సినీ, రాజకీయ ప్రముఖులకు ప్రత్యేక చట్టం ఏమైనా చేస్తారా? అని ప్రశ్నించారు.

అసలు ఏం అనుకుంటున్నారో!

అల్లు అర్జున్ అరెస్టుపై మాట్లాడుతూనే సినీ ప్రముఖులపైనా సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. సినీప్రముఖులు కూడా ఏం అనుకుంటున్నారో తెలియడంలేదని ధ్వజమెత్తారు. తొక్కిసలాటలో మహిళ చనిపోగా, ఆమె కుమారుడు కోమాలో ఉంటే ఆ కుటుంబాన్ని సినిమా ప్రముఖులు ఎవరూ పరామర్శించలేదని మండిపడ్డారు. జైలుకు వెళ్లొచ్చిన అల్లు అర్జున్‌ను పరామర్శించడంపైనా విమర్శించారు. ఆ హీరోకు కన్నుపోయిందా? కాలు విరిగిందా? అని నిప్పులు చెరిగారు. సినీ ఇండస్ట్రీలో ఉన్న ప్రముఖులు ఏం కోరుకుంటున్నారో తెలియడంలేదని అసహనం వ్యక్తంచేశారు.

ఇకపై బెన్‌ఫిట్ షోలు ఉండవు: కోమటిరెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తర్వాత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కిమ్స్‌లో బాధిత కుటుంబానికి తన కుమారుడి పేరుతో ఏర్పాటు చేసిన ప్రతీక్ ఫౌండేషన్ నుంచి రూ.25 లక్షలు ఆర్థికసాయం ప్రకటించారు. వైద్యఖర్చులను కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో బెన్‌ఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని ప్రకటించారు. ఆ తర్వాత కిమ్స్‌కు వెళ్లి శ్రీతేజ్ తండ్రికి రూ.25లక్షల చెక్కును అందించి, శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ పుష్ప2 సినిమా తాను కూడా చూశానని, మూడున్నర గంటల టైమ్ వేస్ట్ అయిందని వ్యాఖ్యానించారు. ఇలాంటి సినిమా చూసి యువకులు చెడిపోతున్నారని మండిపడ్డారు. ఇకపై తాను దేవుళ్లు, చరిత్ర, తెలంగాణ ఉద్యమ నేపథ్యం కలిగిన చిత్రాలను మాత్రమే చూస్తానని స్పష్టంచేశారు.

శాసనసభ నిరవధిక వాయిదా

- శీతాకాల సమావేశాల్లో 8 బిల్లులకు ఆమోదం

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): శాసనసభ సమావేశాలు శనివారం నిరవధికంగా వాయిదాపడ్డాయి. ఈ నెల 9న ప్రారంభమైన శీతాకాల సమావేశాలు 7 రోజుల్లో 37 గంటల 44 నిమిషాల పాటు కొనసాగాయి. సమావేశాల సందర్భంగా ప్రభుత్వం 8 బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించగా, 4 అంశాలపై స్వల్పకాలిక చర్చలు జరిగాయి. సభ్యుల నుంచి వచ్చిన 306 ప్రశ్నల్లో, 259ప్రశ్నలు ఆమోదం పొందాయి. అందులో 71ప్రశ్నలకు ప్రభుత్వం జవాబులు ఇవ్వగా మిగిలిన ప్రశ్నలకు జవాబులను సభ్యులకు పంపుతామని స్పీకర్ ప్రకటించారు. సమావేశాల్లో 71 మంది సభ్యులు మాట్లాడగా 69 సప్లిమెంటరీలు అడిగారు. బీజేపీఎల్పీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి, ఆ పార్టీ సభ్యుడు పాయల్ శంకర్, సీపీఐఎల్పీ నాయకుడు కూనంనేని సాంబశివరావు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించారు.

బిల్లులకు మండలి ఆమోదం

శాసనమండలిలో శనివారం మూడు సవరణ బిల్లులు ఆమోదం పొందాయి. రాష్ట్రంలోని 80 గ్రామపంచాయతీలను పురపాలక సంస్థలుగా మారుస్తామన్న ప్రభుత్వం హామీ నేపథ్యంలో ఆ బిల్లులకు మండలి పచ్చజెండా ఊపింది. ఈసీ ట్రిబ్యునల్ సవరణ మేరకు పంచాయతీరాజ్ చట్టం షెడ్యూల్ 8 లోని 140 పంచాయతీల సవరణకు వీలు పడేలా ప్రభుత్వం బిల్లు తీసుకొచ్చింది. ఓఆర్‌ఆర్ పరిధిలోని 51 గ్రామాలను మహానగరపాలకసంస్థలో విలీనం చేసేందుకు జీహెచ్‌ఎంసీ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సినీ నటుడు అల్లు అర్జున్, పక్కన ఆయన తండ్రి, సినీ నిర్మాత అల్లు అరవింద్

నా వ్యక్తిత్వంపై దుష్ప్రచారం

- పర్మిషన్‌తోనే థియేటర్‌కు వెళ్లాను
- అక్కడ రోడ్‌షో నిర్వహించలేదు
- నాపై ఆరోపణలు వందశాతం అబద్ధం
- బాధిత కుటుంబానికి అండగా ఉంటా
- మీడియా సమావేశంలో అల్లు అర్జున్
- అర్జున్ బాధపడుతున్నాడు: అరవింద్

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట, సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణల నేపథ్యంలో అల్లు అర్జున్ స్పందించారు. పోలీసుల అనుమతి లేకుండానే థియేటర్‌కు వెళ్లి, రోడ్‌షో, ర్యాలీ నిర్వహించినట్టు వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని స్పష్టంచేశారు. పోలీసుల అనుమతి తీసుకున్నామని థియేటర్ యాజమాన్యం చెబితేనే అక్కడికి వెళ్లానని తెలిపారు. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల తర్వాత రాత్రి 8గంటల సమయంలో హైదరాబాద్‌లోని తన నివాసంలో అల్లు అర్జున్ మీడియా సమావేశం నిర్వహించారు. ఎక్కడా ముఖ్యమంత్రి పేరు ప్రస్తావించకుండానే ఆయన చేసిన ఆరోపణలకు సమాధానం ఇచ్చారు. తొక్కిసలాట ఘటనలో తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. థియేటర్ వద్ద జరిగిన ఘటన చాలా దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నానని, చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

థియేటర్ నాకు దేవాలయం

సినిమా థియేటర్ తనకు దేవాలయంలాంటిదని, అక్కడ దురదృష్టకరమైన ఘటన జరిగితే తన కంటే ఎక్కువగా బాధపడేవాళ్లం టారా? అన్ని అల్లు అర్జున్ ప్రశ్నించారు. ''శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని గంటగంటకు తెలుసుకుంటున్నాను. అతను కోలుకుంటున్నాడని తెలిసి చాలా ఆనందపడుతున్నాను. నేను ఆ కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారు. వాటిని ఏ మాత్రం భరించలేకపోతున్నా. శ్రీతేజ్ భవిష్యత్తు కోసం పెద్ద అమౌంట్ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని, అవసరమైతే బాలుడికి ఫిజియోథెరపీ చేయించాలని నేను, దర్శకుడు సుకుమార్ మాట్లాడుకున్నాం. ఇవన్నీ తెలుసుకోకుండా మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని అల్లు అర్జున్ పేర్కొన్నారు.

నాకు ఆ విషయమే తెలియదు

థియేటర్ పరిసరాల్లో ఎలాంటి రోడ్‌షో నిర్వహించలేదని అల్లు అర్జున్ తెలిపారు. తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన విషయం తనకు మరుసటి రోజు వరకు తెలియదని చెప్పారు. తనపై కేసు నమోదు కావడం వల్ల నేరుగా వెళ్లి బాధిత కుటుంబాన్ని కలవలేకపోయానని తెలిపారు. 'థియేటర్ వాళ్లు పర్మిషన్ తీసుకున్నామని చెబితేనే నేను అక్కడకు వెళ్లాను. పోలీసులే అక్కడకు వచ్చిన జనాల్ని నియంత్రిస్తూ నా కారు లోపలికి వెళ్లేలా చూశారు. పోలీసులు అక్కడకు వచ్చారంటే పర్మిషన్ ఇచ్చినట్టే కదా! అభిమానులు చుట్టుముట్టడంతో నా కారు ముందుకు కదల్లేదు. నేను అభివాదం చేస్తే రద్దీ క్లియర్ అవుతుందని పోలీసులు చెప్పడంతోనే చేయి ఊపుతూ ముందుకెళ్లాను' అని అల్లు అర్జున్ చెప్పారు. సినిమా చూస్తున్నప్పుడు పోలీసు అధికారులెవ్వరూ తనను కలవలేదని, థియేటర్ యాజమాన్యం వచ్చి బయట రద్దీ పెరుగుతున్నదని చెబితే తాను బయటకు వచ్చానని తెలిపారు.

సంబురాలకు దూరంగా ఇంట్లో కూర్చున్నా

హీరోకు కాళ్లు చేతులు విరిగాయా అన్న సీఎం వ్యాఖ్యలపైనా అల్లు అర్జున్ పరోక్షంగా స్పందించారు. 'కాళ్లు చేతులు విరిగినా ఏం పర్లేదు. అవన్నీ మామూలే. కానీ నేను మాట్లాడని మాటలను మాట్లాడినట్టు ప్రచారం చేస్తున్నారు. ఇరవై ఏండ్ల కెరీర్‌లో ఎప్పుడైనా తప్పుగా ప్రవర్తించిన, మాట్లాడిన సందర్భాలున్నాయా? సినిమా పెద్ద విజయం సాధించింది. కానీ వేడుకలన్నీ రద్దు చేసుకుని 15 రోజులుగా ఇంట్లో కూర్చుని బాధపడుతున్నాను. ఘటన జరిగిన రోజు నుంచి నా మనసు స్థిమితంగా లేదు. నేను కూడా తండ్రినే. నాకూ ఓ కొడుకున్నాడు. బాధిత కుటుంబం బాధ ఎలా ఉంటుందో నాకు తెలియదా?'' అని అల్లు అర్జున్ అన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నందున విలేకరుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం కుదరడం లేదని, త్వరలోనే అన్నింటికీ సమాధానం చెప్తానని స్పష్టంచేశారు.

మా కుటుంబం ఏమిటో మీకు తెలుసు: అల్లు అరవింద్

మూడు తరాలుగా తమ కుటుంబం సినిమారంగంలో ఉందని, ఎప్పుడైనా ఎవరితోనైనా అమర్యాదగా ప్రవర్తించామా అని అల్లు అర్జున్ తండ్రి, సినీనిర్మాత అల్లు అరవింద్ అన్నారు. ''థియేటర్ ఘటన జరిగిన తర్వాత అల్లు అర్జున్ మా ఇంట్లోని పార్కులో ఓ మూలన కూర్చొని అదే ఆలోచనలో ఉన్నాడు. అభిమాని కుటుంబం ఇలా అయిపోయిందని బాధపడుతున్నాడు. సక్సెస్ సెలబ్రేషన్స్ చేద్దామన్నా వద్దని చెప్పాడు. మూడు తరాలుగా సినీ రంగంలో ఉన్న మా కుటుంబంపై అసత్య ప్రచారాలు చేస్తుంటే బాధగా ఉంది. అందుకే ఈ రోజు మీ ముందుకొచ్చాం'' అని అల్లు అరవింద్ చెప్పారు.

సీఎంవి శవ రాజకీయాలు

- అసెంబ్లీ సాక్షిగా తెరలేపిన రేవంత్‌రెడ్డి
- కోర్టుపరిధి కేసుపై ఎలా మాట్లాడతారు?
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్ ధ్వజం

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): పవిత్రమైన శాసనసభ సాక్షిగా సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి శవ రాజకీయాలకు తెరలేపారని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ విమర్శించారు. అబద్ధాల కోరు నాయకత్వం వహిస్తే.. అబద్ధాలకు హద్దులు ఉండవని, పవిత్రమైన అసెంబ్లీ గోడల మధ్య అడ్డంకులు లేకుండా వ్యాప్తి చెందుతాయని సీఎం తీరుపై ఎక్స్‌లో శనివారం ట్వీట్ చేశారు. రేవతి విషాద మరణంపై రాజకీయ ఆరోపణలు చేయడానికి అసెంబ్లీని వాడుకున్నారని ధ్వజమెత్తారు. అల్లు అర్జున్‌పై నమోదైన కేసు హైకోర్టు పరిధిలో ఉన్నప్పటికీ అసెంబ్లీలో ప్రస్తావించి కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని విమర్శించారు. ఇది ఆర్టికల్ 121, 211, నిబంధన 65(7) స్ఫూర్తిని ఉల్లంఘించినట్టే అవుతుందని తెలిపారు. శాసనసభ విధివిధానాలు, ప్రవర్తన నియమాల్లోని 66, 82కు విరుద్ధమని పేర్కొన్నారు. ఇలాంటి అంశాన్ని సభలో మాట్లడేందుకు స్పీకర్ ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. నిజంగా రేవతి కుటుంబంపై సానుభూతి ఉంటే ఆమె కుటుంబానికి ఇప్పటిదాకా పరిహారం ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. థియేటర్ వద్ద సరైన భద్రతా చర్యలు చేపట్టకుండా అనుమతి ఇచ్చిన పోలీసులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

సీఎం సోదరులపై చర్యలేవి?

అసెంబ్లీ సాక్షిగా తన సోదరులకు ఎలాంటి అధికారాలు లేవని చెప్పిన సీఎం.. కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి మరణానికి కారకులైన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని దాసోజు శ్రవణ్ ప్రశించారు. సీఎం సోదరులే తన చావుకు కారణమని సూసైడ్ నోట్‌లో సోయిరెడ్డి స్పష్టంగా పేర్కొన్నా.. ఇప్పటిదాకా ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని పేర్కొన్నారు. హైడ్రా పేరిట పేదల ఇండ్లను కూలుస్తూ సీఎం సోదరుడికి మాత్రం నోటీసులకే పరిమితం చేయడమేంటని తెలిపారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం సోదరులపై చర్యలేవని ప్రశ్నించారు.

సభలో బిల్లు పెట్టకముందే పేపర్లలో ప్రకటనలా?

- 'భూభారతి'పై ప్రభుత్వ తీరును తప్పపట్టిన మండలి చైర్మన్ గుత్తా

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): చట్టసభల్లో ప్రవేశపెట్టే బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే మీడియాకు లీకులు ఇస్తుండటంపై శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏదైనా బిల్లును సభలో ప్రవేశపెట్టక ముందు దానికి సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. భూభారతి చట్టం అమల్లోకి రాకముందే దానిపై పేపర్లలో ప్రకటనలు వచ్చాయని, ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని విపక్ష సభ్యులు మండలి చైర్మన్ దృష్టి తీసురావడంతో.. ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను ఆహ్వానించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రొటోకాల్స్‌పై కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలని, ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు చేయాలని ప్రభుత్వానికి తెలిపారు.

రెవెన్యూ గ్రామాలు పెరుగుతయా: ఎమ్మెల్సీ శేరి

రాష్ట్రంలో భూభారతి చట్టం వస్తున్న క్రమంలో రెవెన్యూ గ్రామాల సంఖ్యను పెంచే అవకాశాలు ఉన్నాయా. ఈ మేరకు రీఆర్గనైజేషన్ ఏమైనా చేస్తారా? నూతన రెవెన్యూ చట్టంలో అనుభవదారు కాలం ప్రత్యేకంగా పెట్టడం కరెక్ట్ కాదు.

భూభద్రత కోసమే ధరణి : ఎమ్మెల్సీ తాతా మధు

రాష్ట్రంలో భూముల భద్రత కోసమే కేసీఆర్ ధరణి విధానం తీసుకొచ్చారు. భూములన్నీ డిజిటలైజేషన్ చేశారు. దీంతో అందరి భూములు భద్రంగా ఉన్నాయి. భూభారతితో ప్రజల భూముల కోసం సాఫ్ట్‌వేర్ మారుస్తున్నారా?

కౌలుదారు కాలం సరికాదు: ఎంసీ కోటిరెడ్డి

భూభారతి చట్టంతో రైతులకు ఎంతవరకు లాభం జరుగుతది. ఈ చట్టంలో కౌలుదారుడికి ప్రత్యేక కాలం పెట్టడం సరికాదు. జాగీర్దారు విధానం రద్దు, భూ హక్కుల్లో ఏమైనా మార్పులు ఉన్నాయా? పహాణీలు ఏ విధంగా చేర్చబోతున్నారు?

భూభారతి వచ్చే ఎన్నికలకు రెఫరెండం

- ధరణిని తప్పబట్టడం లేదు.. విధానమే బాగాలేదు
- శాసనమండలిలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : భూభారతి చట్టం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రెఫరెండం అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం శాసనమండలిలో 'భూభారతి' పేరుతో నూతన రెవెన్యూ చట్టానికి సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ చట్టంతో రైతుల అపరిష్కృత భూములకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పుకొచ్చారు. గ్రామ కంఠాలకు కూడా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ట్రస్టులు, సొసైటీలు, దేవాలయాలకు చెందిన భూముల పరిరక్షణకు వీలుగా పాస్ పుస్తకాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. భూసమస్యల పరిష్కారానికి అధికారాలు వికేంద్రీకరించామని, ఎమ్మార్వో, ఆర్డీవోతో పాటు కలెక్టర్లకు అధికారాలు ఇచ్చినట్టు వివరించారు. ఈ చట్టానికి సంబంధించిన సాఫ్టవేర్‌ను వచ్చే 6 నుంచి 9 నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. ధరణిని తప్పుబట్టడం లేదని, దాని అమలు విధానం బాగా లేదని పేర్కొన్నారు. భూభారతిపై ప్రతిపక్ష సభ్యుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అనంతరం ఈ బిల్లుకు శాసనమండలి ఆమోదం తెలిపింది.

భూభారతి తిరోగమన చర్య

- ధరణితోనే భూమోసాలు మాయం
- బీఆర్ఎస్ అంటే.. 'భూ రక్షణ సమితి'
- భూభద్రత కల్పించిందే కేసీఆర్
- శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : భూభారతి భూముల మాయానికి హారతి పడుతుందని, భూమాత పోర్టల్.. భూమేతకు దారి తీస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూభారతి చట్టంపై ఘాటుగా విమర్శించారు. తెలంగాణ రైతుకు రక్షణ కవచంగా ఉన్న ధరణి పోర్టల్ రద్దుతో రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. భూభారతిని తిరోగమన చర్యగా ఆమె అభివర్ణించారు. భూభారతి బిల్లు శాసనమండలిలో శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రవేశపెట్టారు. అనంతరం చర్చలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో ధరణి అమల్లోకి వచ్చిన తర్వాత భూమోసాలు మాయమయ్యాయని, ధరణితో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చరిత్ర క్షమించదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అంటే.. 'భూ రక్షణ సమితి' అని రైతులు, ప్రజలు అనుకున్నట్టు తెలిపారు. కేసీఆర్ అన్ని కోణాల్లో ఆలోచించే రైతుకు భూమిపై యాజమన్య హక్కు ఉండేలా చేశారని గుర్తుచేశారు. రైతులకు భూభద్రత కల్పించిందే కేసీఆర్ అని తెలిపారు. ధరణితో అనేక భూ సమస్యలు పరిష్కారమయ్యాయని, 35,749 మంది ఉద్యోగులు కేవలం 100 రోజుల్లోనే రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేశారని కొనియాడారు.

ధరణితోనే సర్కారు భూములకు భద్రత..

ధరణి రాకముందు చార్మినార్‌ను కూడా రిజిస్ట్రేషన్ చేసే పరిస్థితి ఉండేదని ఆవేదన వ్యక్తంచేశారు. కానీ, ధరణితో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను కాపాడిందని కవిత స్పష్టంచేశారు. భూ రిజిస్ట్రేషన్ల వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసిందని, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకేసారి చేయడంతో 42 నిమిషాల్లో పని పూర్తయ్యేదని గుర్తుచేశారు. భూ రికార్డులు సక్రమంగా ఉండడంతోనే రాష్ట్రంలో భూముల రేట్లు పెరిగాయని స్పష్టంచేశారు. ధరణితోనే రాష్ట్రంలో దాదాపు 66 లక్షల మందికి రైతులకు బీఆర్ఎస్ సర్కారు రైతుబంధు అందించిందని తెలిపారు. గతంలో పంట రుణాలు కూడా వచ్చేవి కావని, ధరణితోనే బ్యాంకులు రుణాలు ఇవ్వడం మొదలుపెట్టాయని చెప్పారు. తద్వారా ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల నుంచి రైతులు విముక్తి పొందారని పేర్కొన్నారు.

భూభారతితో మళ్లీ పాత రోజులే..

రెవెన్యూ చట్టంలో 32 కాలాలతో పహాణీలు రాయడం ప్రారంభిస్తే మళ్లీ పాత వ్యవస్థ వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. తద్వారా కేసులు, ఆర్థిక భారం పెరుగుతుందని కవిత పేర్కొన్నారు. రాష్ట్రమంతా ఒకేసారి కాకుండా దశల వారీగా రీసర్వే చేపట్టాలని సూచించారు. ఎవరూ ట్యాంపర్ చేయడానికి వీలు లేకుండా పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ భూధార్ కార్డు ఎందుకు తీసుకొస్తున్నట్టు? అని ప్రశ్నించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న ఆబాదీ భూములపై ప్రభుత్వ పెద్దల కన్ను పడిందనే ప్రచారం జరుగుతున్నదని సభ దృష్టికి తీసుకొచ్చారు. భూ వ్యవహారాల్లో తప్పు జరిగితే ప్రభుత్వ ఉద్యోగులకు శిక్ష వేస్తామని భయపెట్టడం సరికాదని సూచించారు.

సివిల్ రైట్స్‌డేను విస్మరిస్తున్న ప్రభుత్వం

గ్రామాలు, పట్టణాల్లో కులవివక్ష, అంటరానితనం నిర్మూలనపై చైతన్యం కల్పించేందుకు ప్రతినెలా చివరి ఆదివారం సివిల్ రైట్స్‌డే పేరుతో జరిపే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. శనివారం ఆమె శాసనమండలిలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఎక్కడా సివిల్ రైట్స్ డే అమలుచేయలేదని పేర్కొన్నారు. ఏడాదిగా గ్రామాల్లో మహిళలపై నేరాల రేటు పెరుగుతున్నదని, దీనిపై ప్రభుత్వం దృష్టిపెట్టడంతోపాటు సివిల్ రైట్స్ డేను అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సభ్యుల సూచనలు పరిగణలోకి తీసుకొని అవసరమైన చర్యలు చేపడుతామని సమాధానమిచ్చారు.

కౌలురైతులకు కూడా ఇవ్వాలి: సీపీఐ కూనంనేని

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): రైతుబంధు, నేడు రైతుభరోసా పథకాలు రైతాంగానికి ఎంతో మేలు చేసేవేనని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వివరించారు. సాగు భూములకు మాత్రమే రైతుభరోసాను అందించాలని కోరారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసాను అందించాలని డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధర కాకుండా ఎంఎస్ స్వామినాథన్ సిఫారసుల మేరకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంటల బీమా అమలు చేయాలని కోరారు.

అటు ఈడీ.. ఇటు ఏసీబీ

- ఫార్ములా ఈ-కార్ రేసుపై ముమ్మర దర్యాప్తు
- విడివిడిగా వివరాలు తెప్పించుకుంటున్న సంస్థలు

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో ఓవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), మరోవైపు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తును ముమ్మరం చేశాయి. ఆగమేఘాల మీద ఈసీఐఆర్ నమోదు చేసిన ఈడీ.. ఫార్ములా ఈ-కార్ రేస్‌కు సంబంధించిన ఫైళ్లు కావాలని ఎంఏయూడీ కార్యాలయాన్ని కోరడంతో వాటిని అప్పటికే ఏసీబీ అధికారులు తీసుకెళ్లారని సమాధానం వచ్చినట్టు తెలిసింది. ప్రస్తుతం ఫెమా ఉల్లంఘనలపై దృష్టిసారించిన ఈడీ.. విదేశీ కంపెనీకి నిధులు పంపేముందు రాష్ట్ర అధికారులు ఆర్బీఐ నుంచి అనుమతి తీసుకున్నారా? సంబంధిత నిబంధనల ను పాటించారా లేదా అనే కోణంలోనే దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. దీని లో భాగంగా హెచ్‌ఎండీఏ బ్యాంకు ఖాతా నుంచి ఎఫ్ఈవో స